క్లుప్తంగా

నేడు పుట్టింటికి పేరంటాలమ్మ

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో అమ్మవార్లను బుధవారం సాయంత్రం పుట్టింటికి తీసుకెళ్లనున్నారు. సంక్రాంతి జాతర మహోత్సవాల్లో భాగంగా ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి అమ్మవార్లను గ్రామంలో రాజుల బజారులోని పుట్టింటికి తీసుకెళ్లడం అనవాయితీగా వస్తోంది. సంక్రాంతి ఉత్సవాలకు ముందు ఒక రోజు ఈనెల 12న సాయంత్రం పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలు బహూకరణ అనంతరం పేరంటాలమ్మ తిరిగి ఆలయ ప్రవేశం చేస్తారు. ఆలయ ఆధ్వర్యంలో అమ్మవారిని పుట్టింటికి తీసుకెళ్లేందుకై ఆలయ చైర్మన్ బోయిన భాను ప్రదీప్, ఈవో పి.లోకేశ్వరి ఏర్పాట్లు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పెనమలూరు: పోరంకి-నిడమానూరు రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలు అవ్వటంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ.రామారావు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప కార్మిక నగర్ కాలువ కట్టకు చెందిన కోమటి గోపి ప్రైవేటు బస్సు డ్రైవర్‌గా పని చేస్తాడు. అతను తన మిత్రుడు అనీల్‌కుమార్‌తో కలిసి సోమవారం పోరంకి-నిడమానూరు రోడ్డులో బైక్‌పై వెళుతుండగా ఎదురుగా వచ్చిన మరో బైక్ వీరిని ఢీకిట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న గోపి, అనీల్‌కుమార్‌కు గాయాలవ్వడంతో విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని తెలిపారు.

అయోధ్య అక్షింతల పంపిణీ



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో మంగళవారం భక్తులు అయోధ్య రామాలయానికి చెందిన అక్షింతలు పంపిణీ చేశారు. విశ్వ హిందూ పరిషత్ సహకారంతో వచ్చిన అమోధ్య అక్షింతలకు భక్తులు తొలుత ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆలయ నిర్వాహకులు అక్షింతలు అందజేశారు. రాష్ట్ర ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు, శ్రీరామలింగేశ్వరస్వామివారి క్యాలెండర్లను భక్తులకు పంపిణీ చేశారు.

క్రీడా దుస్తులు అందజేత

హనుమాన్‌జంక్షన్ రూరల్: విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి చదువులో పాటు క్రీడల్లోనూ ప్రోత్సాహించాలని దాత దేవినేని కిషోర్ అన్నారు. స్థానిక నూజివీడురోడ్డులోని బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌కు రూ.25 వేల విలువ చేసే 50 జతల క్రీడాదుస్తులను మంగళవారం అందజేశారు. ఈ దుస్తులను పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సుంకర సుభాష్ చంద్రబోస్ చేతుల మీదగా ప్రధానోపాధ్యాయుడు తోట వెంకట నాగేశ్వరరావుకు అందించారు. పాఠశాల తరుపున వివిధ క్రీడాపోటీల్లో పాల్గొనే విద్యార్థులకు ఈ దుస్తులు అందిస్తామని ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు దుస్తులు బహూకరించిన దాత దేవినేని కిషోర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఫిజికల్ డైరెక్టర్ పామర్తి వెంకటేశ్వరరావు, గోగినేని మధుకిరణ్, తుమ్మల ఆదినారాయణ పాల్గొన్నారు.

రేపు మాదిగల సామాజిక న్యాయ మహాసభ

గన్నవరం: విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈ నెల 4న జరిగే మాదిగల సామాజిక న్యాయ మహాసభను జయప్రదం చేయాలని ఇంటలెక్చువల్ ఫారమ్ ఫర్ మాదిగాస్ రాష్ట్ర అధ్యక్షుడు మట్టా విద్యార్థి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సాయంత్రం 3 గంలకు ర్యాలీ, అనంతరం 4 గంటలకు జరిగే ఈ సమావేశంలో పలువురు మేధావులు, ప్రముఖులు పాల్గొంటారని పేర్కొన్నారు.

ఆర్థిక సాయం



ఉయ్యూరు: పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని డీసీఎంఎస్ చైర్ పర్సన్ పడమట స్నిగ్ధ అన్నారు. మండలంలోని కలవపాముల గ్రామానికి చెందిన ఎంపీపీ చీలి కల్పన భర్త చీలి కోటేశ్వరరావు అనారోగ్యంతో బాధపడుతున్న కారణంగా రక్ష ఫౌండేషన్ తరపున రూ.10 వేలు ఆర్థిక సాయం మంగళవారం అందించారు. ఈ సందర్భంగా స్నిగ్ధ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న ప్రభుత్వానికి, సీఎం జగనన్నకు బాసటగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో చెబత్తిన నాని, మాట్టా నాని, తిరువీధుల రాజేంద్ర, చీలి కోటేసు, శిఖా రాంబాబు , కొడాలి రవి, చీలి రమేష్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలే ప్రభుత్వ లక్ష్యం



గన్నవరంలో మెడికల్ కిట్లు అందజేస్తున్న ఎంపీపీ అనగాని రవి



తరిగొప్పలలో మందుల కిట్లు అందజేస్తున్న ఎంపీడీవో శేషగిరిరావు

గన్నవరం: ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. స్థానిక బుద్దవరం రోడ్డులోని గ్రామ సచివాలయం-2లో ఏర్పాటు చేసిన సురక్ష క్యాంప్‌ను ఎంపీపీ అనగాని రవి, వైద్య సేవలను జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎం డీ.గౌసాని ప్రారంభించారు. అనంతరం క్యాంప్‌లో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను, ఓపీ రిజిస్ట్రేషన్, రక్త పరీక్షల విభాగాలను ఎంపీపీ పరిశీలించారు. రోగులకు మెడికల్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా అనగాని మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజల ఆరోగ్య భద్రతకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భరోసాగా నిలుస్తుందన్నారు. అందుకే కార్పొరేట్ తరహాలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించేందుకు రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌లను ప్రారంభించినట్లుగా తెలిపారు. అన్ని రకాల వైద్యసేవలతో పాటు 110 రకాల మందులను అందజేస్తున్నట్లుగా చెప్పారు. వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు పోలిమెట్ల జయరాజు, ఎంపీడీఓ ఈ.సత్యకుమార్, ఈఓపీఆర్డీ పి. వెంకటేశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి సీహెచ్. అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉంగుటూరు: మండలంలో తరిగొప్పల గ్రామ సచివాలయం వద్ద రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో శేషగిరిరావుముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వైద్యులు, సిబ్బంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డాక్టర్లు శిరీష, ఇమ్రాన్, స్నిగ్ధ, ఎంపీటీసీ టి.నటరాజన్, ఈవోపీఆర్‌డీ అమీర్ బాషా, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు భవిష్యత్ లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి



ప్రోత్సాహక బహుమతులు స్వీకరించిన విద్యార్థులతో మానవత సభ్యులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: విద్యార్థులు భవిష్యత్ లక్ష్యాన్ని నిర్దేశించుకుని, ఆ లక్ష్యసాధనకై ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్ర కన్వీనర్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. స్థానిక నూజివీడు రోడ్డులోని బాపులపాడు జెడ్పీ హైస్కూళ్లలో మానవత ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు ఉచితంగా కేరీర్ గైడెన్స్ తరగతులను మంగళవారం నిర్వహించారు. గత ఏడాది 6,7,8,9 తరగతుల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు మానవత తరుపున ప్రోత్సాహకంగా పెద్ద బాలశిక్ష పుస్తకం, ప్రశంసా పత్రం, జ్ఞాపికలను పంపిణీ చేశారు. మానవత హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్షుడు కూర్లెళ్ల సుబ్బాచారి, ప్రధాన కార్యదర్శి కళ్లేపల్లి నారాయణరావు, మానవత సినీయర్ సభ్యులు వడ్డి రాజేశ్వరరావు, చక్కా సుబ్బారావు, దయాల రాజేశ్వరరావు, జన్యావుల సత్యనారాయణ, పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సుంకర సుభాష్‌చంద్ర బోస్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తోట వెంకట నాగేశ్వరరావు పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం



తాడిగడప సెంటర్‌లో డ్రైనేజీ తవ్వుతున్న జేసీబీ

- ఆక్రమణల తొలగింపునకు రంగం సిద్ధం
- దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పనులకు మోక్షం
- ఎంపీ, ఎమ్మెల్యే కృషి ఫలితం

పెనమలూరు: విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదార బందరు రోడ్డు పక్కన డ్రైనేజీ నిర్మాణానికి ఎన్‌హెచ్‌ఏ మంగళవారం శ్రీకారం చుట్టింది. ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి డ్రైనేజీలు నిర్మాణం చేయాలని ఎన్‌హెచ్‌ఏ అధికారులపై ఒత్తిడి తీసుకు వచ్చారు. దీంతో ఎన్‌హెచ్‌ఏ డ్రైనేజీ పనులు మండల పరిధిలో ఆటోనగర్ టెర్మినల్ వద్ద నుంచి పోరంకి వరకు నిర్మించటానికి బందరు రోడ్డు ప్యాకేజీలో భాగంగా నిధులు కేటాయించి టెండర్ల ద్వారా కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించింది. దీంతో మంగళవారం తాడిగడప వద్ద డ్రైనేజీ నిర్మాణానికి జేసీబీతో పనులు ప్రారంభించారు. గత టీడీపీ పాలనలో స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పట్టించుకోలేదు. బందరు రోడ్డు విస్తరించి నిర్మాణం చేసి దాదాపు 10 సంవత్సరాలు గడిచిన తరువాత డ్రైనేజీ నిర్మాణానికి ఎన్‌హెచ్‌ఏ ముందుకు వచ్చింది. అయితే రోడ్డుపై ఆక్రమణలు ఉండటంతో ఇప్పటికే అధికారులు మార్కింగ్ చేశారు.

పదేళ్ల తర్వాత..

కానూరు పెట్రోల్ బంక్ నుంచి మచిలీపట్నం వరకు దాదాపు 65 కిలో మీటర్ల మేర బందరు రోడ్డును విస్తరించి గత 10 సంవత్సరాల కిందట నిర్మాణం చేశారు. కానూరు పెట్రోల్ బంక్ నుంచి పోరంకి చేపల కుండీల వరకు 150 అడుగులు, అక్కడి నుంచి మచిలీపట్నం వరకు 200 అడుగుల మేర రోడ్డు విస్తరించి నిర్మాణం చేశారు. అయితే అప్పుడు డ్రైనేజీ పనులు చేయలేదు. దీంతో వర్షం చినుకుపడితే కానూరు, కామయ్యతోపు, పోరంకి, పెనమలూరు ప్రాంతాల్లో డ్రైనేజీ నీరు రోడ్డు పైకి చేరుకోని పరిస్థితులు అధ్వానంగా మారుతున్నాయి. దాదాపు అడుగు మేర నీరు రోడ్డుపై నిలిచి పోవటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. కాలనీలు, గృహాల్లో నీరు బయటకు వెళ్లే మార్గం లేక తీవ్ర సమస్యగా మారింది. ఈ సమస్యకు ఎట్టకేలకు మోక్షం లభించింది.

జాతీయ రహదారి ఆక్రమణలు..

డ్రైనేజీ పనులు చేయటానికి జాతీయ రహదారి పూర్తిగా ఆక్రమణలకు గురైంది. గతంలో 150 అడుగుల మేర ఎన్‌హెచ్‌ఏ భూసేకరణ చేసింది. రోడ్డు 80 అడుగులు మాత్రమే నిర్మాణం చేసింది. మిగితా 70 అడుగుల రోడ్డు మార్జిన్లు వదలగా అవి ఆక్రమణలకు గురయ్యాయి. ఇప్పుడు డ్రైనేజీ నిర్మాణం చేపట్టడంతో ఆక్రమణలు తొలగించాల్సి ఉంది. సర్వే చేసి వేసిన మార్కింగ్ వరకు ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించి సహకరించాలని, కాని పక్షంలో తామే ఆక్రమణలు తొలగిస్తామని ఎన్‌హెచ్‌ఏ అధికారులు తెలిపారు.

పెంచిన, కొత్త పింఛన్ల పంపిణీ



శేరినరసన్నపాలెంలో పింఛన్ మంజూరు పత్రాలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు



గన్నవరంలో పింఛన్ నగదు అందజేస్తున్న ఎంపీపీ, ప్రజాప్రతినిధులు

గన్నవరం: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని ఎంపీపీ అనగాని రవి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం రూ.2,750 నుంచి రూ.3 వేలకు పెంచిన వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ, కొత్త పింఛన్ల మంజూరు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ, ఇతర ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా పెన్షన్ నగదును అందజేశారు. అనంతరం అనగాని మాట్లాడుతూ.. గత టీడీపీ ప్రభుత్వం జన్మభూమి కమిటీల పేరుతో అర్హులకు పింఛన్లు ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రం కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులకు పింఛన్లు అందజేస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం మేరకు రూ.2 వేల పింఛన్ నగదును విడతల వారీగా రూ.3 వేలకు పెంచినట్లు తెలిపారు. కొత్తగా మంజూరైన 171 పింఛన్లతో కలిపి మండలంలో 11,512 మందికి నెలకు రూ.3.43 కోట్లు ప్రభుత్వం పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. నియోజకవర్గ ప్రజల అభ్యున్నతికి ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ నిరంతరం పాటుపడుతున్నారని తెలిపారు. పార్టీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పోలిమెట్ల జయరాజు, ఎంపీడీఓ ఈ.సత్యకుమార్, ఈవోపీఆర్డీ పి.వెంకటేశ్వరమ్మ, మండల కో ఆప్షన్ సభ్యులు ఎస్‌కే కరిముల్లా, సర్పంచ్‌లు డొక్కు వెంకన్నబాబు, నల్లూరి వెంకటేశ్వరరావు, పలువురు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి రూ.5.65 కోట్లు విడుదల

పెనమలూరు: పెనమలూరు మండలం, డాక్టర్ వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీలో కొత్త పింఛన్లను ప్రభుత్వం మంజూరు చేసింది. లబ్ధిదారులకు పింఛన్ అందజేసేందుకు రూ.5.65 కోట్ల నిధులను విడుదల చేశారు. తాడిగడప మున్సిపాలిటీలో 12,997 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి ప్రభుత్వం పెంచిన పింఛన్ రూ.3 వేలు చొప్పున మొత్తం రూ.3.91 కోట్లు నిధులు మంజూరయ్యాయి. పెనమలూరు మండలంలో మొత్తం పింఛన్ లబ్ధిదారులు 5849 మంది ఉన్నారు. వీరికి రూ.1.74 కోట్లు నిధులు మంజూరు చేశారు.

286 కొత్త పింఛన్ల మంజూరు..

పెనమలూరు మండల పరిధిలో కొత్తగా 113 పింఛన్లు మంజూరు చేశారు. వారికి కూడా ఈ నెల నుంచి రూ.3 వేల చొప్పున ఇస్తారు. తాడిగడప మున్సిపాలిటీలో 173 మందికి కొత్తగా పింఛన్లు మంజూరు చేశారు. కానూరులో 25, పోరంకిలో 30, తాడిగడపలో 38, యనమలకుదురులో 80 చొప్పున ప్రభుత్వం మంజూరు చేసింది.

నేడు పింఛన్లు పంపిణీ చేయనున్న ఎమ్మెల్యే..

కాగా పెనమలూరు మండలం, తాడిగడప మున్సిపాలిటీ ప్రాంతాలకు చెందిన కొత్త పింఛన్ లబ్ధిదారులకు పోరంకిలో బుధవారం ఉదయం ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి పంపిణీ చేస్తారని ఏవో లోయ శివశంకర్‌రావు తెలిపారు. వీరితో పాటు పాత పింఛన్ లబ్ధిదారులకు కూడా పింఛన్లు అందజేస్తామన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రతి నెలా ఒకటిన ఇంటి వద్దకే వచ్చి ఠంచన్‌గా పింఛన్ అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ అన్నారు. బాపులపాడు మండలం శేరినరసన్నపాలెంలో కొత్త లబ్ధిదారులకు పింఛన్లను మంగళవారం పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తాజాగా పెంచిన మొత్తంతో కలిపి రూ.3 వేలు పింఛను అందుకున్న అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు ఆనందోత్సాహాలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ అడపా అంజిబాబు అధ్యక్షతన జరిగిన సభలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆవిర్నేని శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు చిర్రా అంజిబాబు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పడకల వీర్రాజు, బాపులపాడు సర్పంచ్‌లు సరిపల్లి కమలాభాయి, చెన్నుబోయిన వెంకట మహలక్ష్మీ, ఎంపీటీసీ సభ్యులు కొనకళ్ల వెంకటేశ్వరరావు, మత్తి మాధవీలత, చెన్నుబోయిన వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేసిన వలంటీర్



గన్నవరం రూరల్: మండలంలోని తెంపల్లి గ్రామానికి చెందిన షేక్ మస్తాన్‌బీ కాలుకు ఆపరేషన్ జరగడంతో చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె పింఛన్‌దారు కావడంతో వలంటీర్ నంద్యాల సమ్మయ్య ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న మస్తాన్‌బీకి రూ.3 వేలు అందజేశారు. ఇప్పటి వరకూ రూ.2750 పింఛన్ అందజేసిన ప్రభుత్వం, ఈ నెల నుంచి రూ.3 వేలు ఇస్తున్నామని చెప్పారు. వలంటీర్ సమ్మయ్యను గ్రామస్తులు, సచివాలయం సిబ్బంది అభినందించారు.

49 మద్యం బాటిళ్లు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న బాటిళ్లు, నిందితుడు శివాజీ

గన్నవరం: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని మంగళవారం రాత్రి గన్నవరం పోలీస్‌లు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..స్థానిక గౌడపేటకు చెందిన మల్లవల్లి శివాజీ అక్రమంగా మద్యం బాటిళ్లను నిల్వ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నాడు. ఈ నేపథ్యంలో కేసరపల్లి వద్ద తనిఖీలు చేపట్టిన సీఐ పి.కనకరావు నేతృత్వంలోని ఎస్ఐ శ్రీనివాస్, నవీన్, సిబ్బంది శివాజీని అదుపులోకి తీసుకున్నారు. ఆతని వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 49 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చెప్పారు. ఆతనిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని వివరించారు.

చెత్త తరలింపునకు చర్యలు తీసుకోండి

డీపీవో ఎస్వీ నాగేశ్వరనాయక్



చెత్త నిల్వలను పరిశీలిస్తున్న డీపీఓ, ఎంపీపీ

గన్నవరం: స్థానిక కోనాయి చెరువు వద్ద అసంపూర్తిగా ఉన్న చెత్త తరలింపు పనులను త్వరితగతిన పూర్తిచేయాలని డీపీవో ఎస్వీ నాగేశ్వరనాయక్ ఆదేశించారు. మంగళవారం చెత్త తరలింపు ప్రాంతాన్ని ఎంపీపీ అనగాని రవి, ఎంపీడీఓ ఈ.సత్యకుమార్‌తో కలిసి డీపీఓ పరిశీలించారు. చెత్త తరలింపు టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ షరతులను ఉల్లంఘించి ఎక్కడ చెత్తను అక్కడ వదిలివేయడంపై అధికారులను ప్రశ్నించారు. కాంట్రాక్టర్‌ను పిలిపించి పూర్తి స్థాయిలో చెత్తను తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని డీపీఓ సూచించారు. కాంట్రాక్టర్ ముందుకురాని పక్షంలో పంచాయతీ కార్యదర్శి పర్యవేక్షణలో చెత్త కుప్పలను ఎత్తివేసి నాలుగు రోజుల్లో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. పరిశుభ్రంగా తీర్చిదిద్ది మొక్కలు నాటాలని, చెత్త డంపింగ్ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. వర్మీకంపోస్టు ఎరువుల తయారీని ప్రారంభించాలన్నారు. అవసరమైతే మండల పరిషత్ ద్వారా నిధులు కేటాయిస్తామని ఎంపీపీ అనగాని రవి తెలిపారు. ఈఓపీఆర్డీ పి.వెంకటేశ్వరమ్మ, ఈవో అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

తుదిదశకు ఖరీఫ్ పనులు



ప్రొద్దుటూరులో కట్టివేత పనుల్లో కూలీలు

కంకిపాడు: ఖరీఫ్ వ్యవసాయ పనులు తుదిదశకు చేరుకున్నాయి. నేలవాలిన వరి పంట కోత కోసి పనలు ఆరబెడుతున్నారు. ఆరిన పనలను కట్టివేత వేస్తున్నారు. కుప్పలు నూర్పి ధాన్యం మార్కెట్‌కు తరలించేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు.

మండలంలో..

మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 16 వేల ఎకరాల్లో వరి సాగు జరిగింది. 1061, 5204, మొదలైన వరి విత్తన రకాలను రైతులు సాగు చేశారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించి దిగుబడులు ఆశాజనకంగా వచ్చాయి. పంట మార్కెట్‌కు రావటంతో ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణను ప్రభుత్వం చేపట్టింది. గత నెలలో సంభవించిన తుపానుతో రైతులకు అకాలకష్టం వచ్చిపడింది. కోతకు సిద్ధంగా ఉన్న పంట నేలవాలింది. ధాన్యం తడిచి, పనలు నీట మునిగి ఇబ్బందులు పడ్డారు.

రైతులకు అండగా..

తుపాను నష్ట నివారణకు ప్రభుత్వం, యంత్రాంగం సమర్థంగా చర్యలు తీసుకుని రైతులకు అండగా నిలిచింది. వాతావరణ పరిస్థితులు కూడా అనుకూలంగా మారటంతో నేలవాలిన వరి పంటను కోత కోసి పనలను ఆరబెడుతున్నారు. ఆరిన పనలను కట్టివేత వేస్తున్నారు. ముందస్తుగా కోత కోసి కట్టివేత వేసిన వరి కుప్పలను నూర్పి ధాన్యం మిల్లులకు తరలించే పనుల్లో రైతులు నిమగ్నమవుతున్నారు. సంక్రాంతి పండుగ నాటికి ఖరీఫ్ పనులు పూర్తి చేసేందుకు అనువుగా సాగు పనులు చేపడుతున్నారు.

28,135 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

మండలంలోని వివిధ గ్రామాల్లో 14 ఆర్‌బీకేల పరిధిలో ఖరీఫ్ ధాన్యం సేకరణను ప్రభుత్వం చేపట్టింది. ఏ గ్రేడు 4756.120 టన్నులు, కామన్ వెరైటీ 23379.480 టన్నులు సేకరించింది. రూ.61.529 కోట్ల విలువైన ధాన్యం సేకరించారు.

గ్రామాభివృద్ధి ప్రణాళికల ఆమోదం



గ్రామసభలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు



నిడమానూరులో మాట్లాడుతున్న సర్పంచ్ శీలం రంగారావు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామాభివృద్ధి పనుల ప్రణాళికపై 2024-25 ఆర్థిక సంవత్సారానికి గాను గ్రామసభలో తీర్మానం చేశారు. మంగళవారం నున్న గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసభ జరిగింది. ఈ గ్రామసభలో గ్రామ పంచాయితీకి వచ్చే సంవత్సరం రానున్న ఆదాయవనురుల నేపథ్యంలో చేపట్టవలసిన అభివృద్ధి పనులపై చర్చించారు. పాతపాడు గ్రామం వైపు వెళ్లే రోడ్డులో డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని, ఎస్సీ కాలనీ వాటర్‌ట్యాంక్ రోడ్డులో రోడ్డు నిర్మాణం గురించి గ్రామసభలో చర్చించారు. ఉపసర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, వార్డు సభ్యులు కాటూరి శ్రీనివాసరావు, స్వాతి, వెంకటశివ, గ్రామ పంచాయతీ కార్యదర్శి జీటీపీ రమణ గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎనికేపాడులో సంత ఏర్పాటుకు నిర్ణయం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు, నిడమానూరు గ్రామాల్లో మంగళవారం గ్రామ సభలు నిర్వహించారు. ఎనికేపాడు పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామ సభలో హిందూ, ఎస్సీ, బీసీ శ్మశానాల అభివృద్ధి, గ్రామాభివృద్ధి ప్రణాళికలపై చర్చించారు. పంచాయతీ వెనుక ఉన్న ఖాళీ స్థలంలో ప్రతి ఆదివారం వారాంతపు సంత నిర్వహించేందుకై గ్రామస్తులతో చర్చించారు. సంక్రాంతి పండుగ అనంతరం ఈ సంతను ఏర్పాటు చేయడానికి సన్నహాలు చేస్తున్నారు. నిడమానూరులో సర్పంచ్ శీలం రంగారావు, ఎనికేపాడులో సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు అధ్యక్షతన వేర్వేరుగా సభలు నిర్వహించారు. నిడమానూరులో జరిగిన గ్రామ సభలో గ్రామ అభివృద్ధి ప్రణాళిక, తాగునీరు, రోడ్లు, డ్రెయిన్ల అభివృద్ధిపై చర్చించారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా గ్రామంలో రూ.1.25 కోట్ల నిధులతో చేపట్టిన మంచినీటి పైప్‌లైన్ విస్తరణ పనులను గ్రామస్తులకు వివరించారు. అనంతరం రామానగర్ ప్రధాన రహదారిని మెరక తోలించి డ్రెయిన్ నిర్మాణం చేయాల్సిందిగా గ్రామస్తులు కోరారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సువర్ణరాజు, గౌడ కార్పొరేషన్ చైర్మన్ మాదు శివరామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు ప్రకాష్‌నాథ్, ప్రసాద్, ఎంపీటీసీ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ రమేష్ మృతి



మాజీ సర్పంచ్ పరిమి రమేష్ (ఫైల్)

రామవరప్పాడు: నిడమానూరు మాజీ సర్పంచ్ పరిమి రమేష్ (64) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు పరిమి వంశీ వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్. గత కొంత కాలంగా రమేష్ నగరంలోని ఆయుష్ హాస్పిటల్‌లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. మూడు రోజుల క్రితమే హాస్పిటల్ నుంచి డిశ్చార్జి చేసి గ్రామంలోని స్వగృహానికి తీసుకొచ్చారు. 2001 నుంచి 2006 వరకు సర్పంచ్‌గా విధులు నిర్వహించి గ్రామాభివృద్ధికి విశేష కృషి చేశారు. గతంలో సొసైటీ చైర్మన్‌గా పని చేసి అందరి మన్ననలు పొందారు. ఆరోగ్యం విషమించడంతో మంగళవారం మధ్యాహ్నం తుది శ్వాస విడిచారు. రమేష్ మరణ వార్త తెలుసుకున్న గొల్లపూడి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు, జెడ్పీటీసీ సువర్ణరాజు, గ్రామ సర్పంచ్ శీలం రంగారావులతో పాటు పలు గ్రామాల నుంచి నాయకులు, గ్రామస్తులు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.